

పంచాయతీ కార్మికుల సమ్మె

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టారు.

11లో



హోరాహోరీగా పోరు !

రాష్ట్రస్థాయి సీఎం కప్ బాలబాలికల వాలీబాల్ పోటీలు ఖమ్మంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి.

10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 17°

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వర్ణ కవచధారణలో రామయ్య దర్శనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచ ధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

కలెక్టరేట్‌లో జాతీయ పతాకం అవనతం

సూపర్‌బజార్(కొత్తగూడెం): మాజీ ప్రధాని, ప్రఖ్యాత ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతిపట్ల రాష్ట్ర ప్రభుత్వం ఏడురోజులు సంతాప దినాలను ప్రకటించింది. ఈ క్రమంలో శుక్రవారం కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని అవనతం చేశారు. మన్మోహన్ మృతి పట్ల కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందని పేర్కొన్నారు. తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని దేశం ఎదుర్కొంటున్న సమయంలో ఒంటిచేత్తో ఒడ్డెక్కించారని కొనియాడారు. మన్మోహన్‌సింగ్ అనుసరించిన విధానాల వల్లే తీవ్ర మాంద్యం ప్రపంచాన్ని కుదిపేసినా మన దేశ ఆర్థిక వ్యవస్థ చెక్కుచెదరలేదని తెలిపారు. కాగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

అనుమతులేవి..?

జిల్లా వ్యాప్తంగా రెచ్చిపోతున్న ఇటుక మాఫియా

- చెరువు శిఖం, వ్యవసాయ భూముల్లో మట్టి తవ్వకాలు
- అక్రమంగా కలప వాడకం, ఎడాపెడా విద్యుత్ చౌర్యం
- ఇటుక బట్టీల ముసుగులో జోరుగా అక్రమాల దందా



లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి దగ్గర అంబసత్రం భూముల్లో అక్రమంగా ఇటుక బట్టీల నిర్వహణ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పేదలకు సొంతింటిని అందించే ఇందిరమ్మ పథకం తొలి అడుగులు పడకముందే జిల్లాలో ఇటుక మాఫియా రెచ్చిపోతోంది. కనీస అనుమతులు తీసుకోకుండానే ఎడాపెడా వ్యవసాయ భూముల్లో తవ్వకాలు చేస్తోంది. కొంకీలు తగిలించి అక్రమంగా విద్యుత్‌ను వాడేస్తోంది. ఒక్కటేమిటీ అమల్లో ఉన్న అన్ని చట్టాలు, నిబంధనలను ఇటుక బట్టీల్లో నిలువునా తగలెట్టేస్తోంది.

మట్టితో మొదలు

ఇటుకలు తయారు చేయాలంటే మట్టి అవసరం. సాధారణంగా చెరువు మట్టిని ఇటుకల తయారీ కోసం ఉపయోగిస్తారు. ఈ మట్టిని తవ్వి తీసేందుకు భూగర్భ, గనుల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. మట్టి తీయాల్సిన చెరువుకు సంబంధించి రెవెన్యూ, జలవనరుల శాఖలు అభ్యంతరం వ్యక్తం చేయకపోతే మైనింగ్ శాఖ అనుమతులు జారీ చేస్తుంది. ఒకవేళ సొంత పట్టా భూమి అయితే నాలా కన్వర్షన్ సర్టిఫికెట్ తీసుకుని మైనింగ్ శాఖ నిబంధనలకు లోబడి మట్టిని వాడుకోవాల్సి ఉంటుంది. ఇక సదరు ప్రాంతం పెసా, 1/70 చట్టం పరిధిలో ఉంటే గ్రామసభ అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంటుంది. కానీ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇటుక బట్టీల్లో ఈ తరహా నిబంధనలు ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు.

వ్యవసాయ భూముల్లో

అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూములు, చెరువు శిఖం భూముల నుంచి మట్టిని ఎడాపెడా తవ్వేస్తున్నారు. ఫలితంగా వ్యవసాయ భూములు సాగుకు పనికి రాకుండా పోవడంతోపాటు చెరువుల దగ్గర ప్రమాదకర స్థాయిలో గోతులు ఏర్పడుతున్నాయి. నిత్యం ఇలా తవ్వుతున్న మట్టితో రోజూ వేల కొద్దీ ఇటుకలు తయారు చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని బట్టీల్లో కాల్చాల్సి ఉంటుంది. అటవీశాఖ అనుమతితో ఈ ఇటుకలు కాల్చే కర్రలను ఉపయోగించాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో ఈ నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. అటవీశాఖ అనుమతులు లేకుండా అడవుల నుంచి సేకరించిన కర్రలను బట్టీల్లో వినియోగిస్తున్నారు. బట్టీల నుంచి వెలువడే దట్టమైన పొగలు ఆకాశాన్ని కమ్మేస్తున్నా ఫారెస్టు శాఖ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

జోరుగా తయారీ

ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం అవుతుండటంతో రాబోయే కొద్ది రోజుల్లో ఇటుకలకు జిల్లా వ్యాప్తంగా గిరాకీ పెరగనుంది. దీన్ని క్యాష్ చేసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల అక్రమ ఇటుక బట్టీలు వెలిశాయి. బట్టీల నిర్వహణలో పాటించాల్సిన ఏ ఒక్క నిబంధన పాటించకుండా రేయింబవళ్లు పని చేసుకుంటూ పోతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రానికి సమీపంలోని అనిశెట్టిపల్లి గ్రామ పరిధిలో ఉన్న అంబసత్రం భూముల్లో ఇటుక వ్యాపారుల అక్రమాలకు అడ్డే లేకుండా పోతోంది.

కొంకీలతో కరెంటు

ఉచిత విద్యుత్ పథకానికి అర్హులైన రైతులు సైతం తమ పొలానికి కరెంటు రావాలంటే సొంతంగా స్తంభాలను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ వాణిజ్యపరమైన విద్యుత్‌ను ఉపయోగించే ఇటుక తయారీదారులు కనెక్షన్ తీసుకోవడం, కరెంటు స్తంభాల ఏర్పాటు సంగతి పక్కన పెట్టేస్తున్నారు. రైతులకు ఉచితంగా కరెంటు అందించే తీగలకు కొంకీలు తగిలించి వాటి నుంచి బట్టీలకు అక్రమంగా విద్యుత్‌ను వాడేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్న విద్యుత్‌శాఖ కిమ్మనడం లేదు.

ఎవరికీ అనుమతి ఇవ్వలేదు

ఇటుక బట్టీల తయారీకి చెరువుల నుంచి మట్టి తీసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ఎవరికీ అనుమతులు మంజూరు చేయలేదు. ఇటుక బట్టీల దగ్గర జరుగుతున్న అక్రమాలను పసిగట్టేందుకు క్షేత్రస్థాయిలో మా సిబ్బందితో పరిశీలన చేయిస్తాం.

–బి.అర్జున్, ఈఈ, జలవనరుల శాఖ

పౌర సేవలు మెరుగు..

- కొత్తగా వార్డు ఆఫీసర్లను నియమించిన ప్రభుత్వం
- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు 57 మంది కేటాయింపు
- రెండు వారాల క్రితమే విధుల్లో చేరిన గ్రూప్–4 ఉద్యోగులు



కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌తో వార్డు ఆఫీసర్లు

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్ల నియామకంతో కొంత ఊరట లభించింది. పురపాలికల్లో పారిశుద్ధ్యం నుంచి మొదలుకుని ఇంజనీరింగ్ విభాగం వరకు ఉద్యోగులు, సిబ్బంది కొరత ఉంది. దీంతో ప్రజలకు సకాలంలో సేవలందడంలేదు. ఫలితంగా క్షేత్రస్థాయిలో ఉండే ఉండే బిల్ కలెక్టర్లపై పని భారం పడుతోంది. ప్రస్తుతం వార్డు ఆఫీసర్ల రాకతో బిల్ కలెక్టర్లకు కొంత ఒత్తిడి తగ్గనుంది. గ్రూప్–4 ద్వారా ఎంపికైన అభ్యర్థులను ప్రభుత్వం ఇటీవల వార్డు ఆఫీసర్లుగా నియమించింది. జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీల కు మొత్తం 57 మందిని కేటాయించారు. వారు రెండు వారాల క్రితం కొత్తగూడెం మున్సిపాలిటీలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరారు. గతంలో వార్డుల్లో సర్వేలు, పన్ను వసూళ్లు, ఇతర శాఖపరమైన పనులను అధికారులు బిల్ కలెక్టర్లతో చేయించేవారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో 20పైన వార్డులుండటం, బిల్ కలెక్టర్లు పది మంది కంటే తక్కువ ఉండటంతో సర్వేలు, రిపోర్టుల్లో జాప్యం జరిగేది. ప్రస్తుతం ఉన్న బిల్ కలెక్టర్లకు తోడు వార్డు ఆఫీసర్లు రావడంతో మున్సి పాలిటీల్లో పనులు, సేవల్లో జాప్యం తగ్గనుంది. వార్డు ఆఫీసర్ల రాకతో అందరిపై ఒత్తిడి కొంతమేరకు తగ్గుతుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

పనులు సులభతరం

నాలుగు మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్ల రాకతో పనులు సులభతరమయ్యే అవకాశం ఉంది. వార్డుల్లో అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు వినే అవకాశం ఉంది. గతంలో మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పటివరకు మున్సిపాలిటీలోని రెవెన్యూ విభాగం అధికారులతో కలిసి బిల్ కలెక్టర్లు ఇంటింటికి తిరుగుతూ ఇంటిపన్ను వసూళ్లు చేసేవారు. ఇప్పుడు వార్డు ఆఫీసర్లు సైతం ఇంటి పనుల వసూళ్లలో భాగస్వాములు కానున్నారు. దీంతోపాటు పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ, వార్డు అభివృద్ధి పనులు, నిర్మాణాలను పర్యవేక్షించనున్నారు.

ముగియనున్న కౌన్సిలర్ల పదవీకాలం

కొత్తగూడెం మున్సిపాలిటీల్లో వచ్చే నెల 26వ తేదీతో వార్డు కౌన్సిలర్ల పదవీ కాలం ముగియనుంది. అప్పుడు వార్డులో వార్డు ఆఫీసర్ల విధులు కీలకంగా మారే అవకాశం ఉంది. కొత్త పాలకవర్గం వచ్చేవరకు వార్డు ఆఫీసర్లు పర్యవేక్షించనున్నారు. ప్రస్తుతం ప్రజాపాలన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సరైన సమాధానం కూడా చెప్పడంలేదు. కొందరికి గ్యాస్ సబ్సిడీ, విద్యుత్ జీరో బిల్లుల సదుపాయం వర్తించడంలేదు. వార్డు ఆఫీసర్ల రాకతో ఈ సమస్యలు కూడా తీరే అవకాశం ఉంది.

మున్సిపాలిటీల వివరాలు..

మున్సిపాలిటీ	వార్డులు	వార్డు ఆఫీసర్లు	జనాభా
కొత్తగూడెం	36	29	లక్షపైన
పాల్వంచ	24	16	లక్ష
ఇల్లెందు	24	07	40 వేలపైన
మణుగూరు	20	05	40 వేలు

ప్రజలకు అందుబాటులో ఉంటారు



మున్సిపాలిటీల్లో నూతనంగా చేరిన వార్డు ఆఫీసర్లు ప్రజలకు అందుబాటులో వార్డుల్లో ఉంటారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకురావచ్చు. ఇంటిపన్నులు, పారిశుద్ధ్య పర్యవేక్షణ వారే చేసున్నారు. కొత్త ఉద్యోగుల నియామకంతో ఉద్యోగులు, సిబ్బందిపై కొంత ఒత్తిడి తగ్గింది.

–శేషాంజన్‌స్వామి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆలయ పవిత్రత, భక్తుల సర్వశ్రేయస్సు కోసం మూడు రోజులుగా పెద్దమ్మతల్లి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో మూడో రోజు అర్చకులు, రుత్వికులు, వేదపండితులు గణపతి పూజ, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారి మూలవిరాట్, ఉత్సవ మూర్తులకు పవిత్రధారణ చేసి పవిత్రోత్సవాలు ముగించారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

దేశం ఓ విశిష్ట వ్యక్తిని కోల్పోయింది..

- మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపై మంత్రి పొంగులేటి

ఖమ్మంమయూరిసెంటర్: క్లిష్ట పరిస్థితుల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడమే కాక గొప్ప చట్టాల రూపకల్పనలో పాలుపంచుకున్న మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో దేశం ఓ విశిష్ట వ్యక్తిని కోల్పోయిందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మాజీ ప్రధాని మృతికి సంతాపంగా ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి ఆయన చిత్రపటం వద్ద మంత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను సంస్కరించడంలో మన్మోహన్‌సింగ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. అంతేకాక ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు.



గోదావరి తీరంలో విడిది..

- ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టిసారించిన కలెక్టర్ జితేష్
- ముమ్మరంగా సాగుతున్న ముక్కోటి పనులు
- భద్రాచలంలో ఎకో టూరిజం సిద్ధం



గోదావరి తీరంలో విడిదికి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

భద్రాచలం: భద్రాచలంలో ఎకో టూరిజానికి రంగం సిద్ధమైంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు గోదావరి తీరంలో ముక్కోటికి విడిది ఏర్పాటు చేసేలా కలెక్టర్ దృష్టి సారించారు. అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యే 31వ తేదీ లోపు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ పనులను పరిశీలించి దిశానిర్దేశం చేశారు. మరోవైపు దేవస్థానం ఆధ్వర్యంలో ముక్కోటి ఏర్పాట్ల పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

పర్యాటకంపై ప్రత్యేక కార్యాచరణ

దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ప్రారంభంకానున్నాయి. జనవరి 9న సాయంత్రం గోదావరిలో హంసవాహనంపై తెప్పోత్సవం, 10న తెల్లవారుజామున ఉత్తరద్వార దర్శనం జరగనున్నాయి. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. దీనికితోడు ప్రస్తుతం శీతాకాల సీజన్‌లో పాపికొండలకు సైతం పర్యాటకుల రద్దీ పెరగనుంది. ఈ క్రమంలో కలెక్టర్ పర్యాటకులు, భక్తులను ఆకర్షించేలా భద్రాచలంలో గోదావరి తీరంలో విడిదికి, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇటీవల ములుగు జిల్లాలో ఏర్పాటు చేసిన ఎకో టూరిజం ప్లాన్‌ను భద్రాచలంలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశీలించేందుకు అక్కడికి ఓ బృందాన్ని సైతం పంపించారు. వెదురు గుడిసెలు, తడికెలు పూర్తిగా ఆదివాసీ సంప్రదాయం ఉట్టిపడేలా గుడారాలు, ఆదివాసీ వస్తువులు, ఉత్పత్తులు, వంటకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

70 గుడారాలకు ఆర్డర్లు..

ములుగు జిల్లా పర్యటనకు వెళ్లి వచ్చిన అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. పర్యాటకులకు ప్రైవసీ కల్పిస్తూనే గోదావరి అందాలను వీక్షిస్తూ, ప్రకృతిని ఆస్వాదించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికే 70 గుడారాలకు ఆర్డర్లు ఇచ్చామని, పనులు తక్షణమే పూర్తి చేయాలని ఐకేపీ అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్లు, స్టాల్స్, వసతి ఏర్పాట్లు మెరుగ్గా ఉండాలన్నారు. ఆదివాసీ గ్రామాల్లో నిర్మించే ఇళ్లు కేవలం పది రోజుల్లో తాత్కాలిక పద్ధతిలో నిర్మిస్తున్నారని, ఆ తరహాలోనే వీటి నిర్మాణం ఉండాలని చెప్పారు. గోదావరి ఒడ్డుపై ఉత్సవాలు పూర్తయ్యేవరకు రోజూ ఆదివాసీ కళాకారులు, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

స్వాగత ద్వారాలు సిద్ధం

దేవస్థానం ఆధ్వర్యంలో ముక్కోటి పనులు వేగంగా సాగుతున్నాయి. బ్రిడ్జి సెంటర్‌లో ప్రధాన రహదారిపై స్వాగత ద్వారం ఇప్పటికే పూర్తి కాగా, సూపర్ బజార్, పార్క్, ఇతర మార్గాలలో పూర్తి కావొస్తున్నాయి. స్వామివారి విహారం జరిగే హంస వాహనం పనులను ప్రారంభించారు. మరమ్మతులు నిర్వహించి రంగులు వేయాల్సి ఉంది. ప్రధాన ఆలయానికి రంగులు వేయటం పూర్తి కాగా విద్యుత్ దీపాల అలంకరణ జరుగుతోంది. రెండు రోజుల్లో లైటింగ్ ట్రయల్‌ను సైతం అధికారులు నిర్వహించనున్నారు. స్వామివారి అవతారాలు, ఉత్సవం జరిగే రోజుల వరకు రోజూ కల్యాణ మండపంలో ప్రత్యేక వేదిక వద్ద సంగీత, సాంస్కృతిక కార్యక్రమాల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో ఉత్తర ద్వార దర్శనం టికెట్ల విక్రయాలు జరుగుతుండగా, ఉత్తర ద్వారం వద్ద సెక్టార్ల విభజన, ఇతర పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

బ్లాక్‌బెర్రీ ఐలాండ్ సందర్శన..



ములుగు జిల్లాలో గుడారాలను పరిశీలిస్తున్న సభ్యులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ములుగు జిల్లాలోని పస్రా అటవీ ప్రాంతంలో ఉన్న బ్లాక్ బెర్రీ ఐలాండ్ సందర్శనకు భద్రాచలం పరిసర ప్రాంత గ్రామాలైన భద్రాచలం, బొజ్జిగుప్ప, బెండాలపాడు, పూబెల్లి గ్రామాలకు చెందిన కొందరిని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం పంపించారు. జిల్లాలోని ప్రత్యేక పర్యాటక ప్రాంతాలు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను బాహ్య ప్రపంచానికి తెలియజేసి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇప్పటికే హైదరాబాద్‌లోని వీ లీవ్ ఇన్ బాంబోనైన్, ఐ కీయ సందర్శన, కేరళ రాష్ట్రం వయనాడ్ జిల్లాలోని ఊరవు వెదురు శిక్షణ కేంద్రానికి సందర్శన కోసం పంపారు. భద్రాచలం ఐటీడీఏ పరిసర ప్రాంతాల్లో గిరిజన మ్యూజియం, గోదావరి ఘాట్ వద్ద రివర్‌సైడ్ క్యాంపెయినింగ్, బొజ్జిగుప్ప గిరిజన గృహాల సందర్శన, బెండాలపాడు, తుమ్మలచెరువు, పూబెల్లి పర్యాటకరంగ అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులకు, గ్రామస్తులకు పర్యాటకరంగంపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. బ్లాక్‌బెర్రీ ఐలాండ్‌లో గుడారాలు, సహజసిద్ధంగా కర్రలతో ఏర్పాటు చేసిన పందిళ్లు, మంచెలు, క్రీడా మైదానాలను బృందం సభ్యులు పరిశీలించారు. సభ్యులు తమ గ్రామాలను కూడా పర్యాటకంగా అభివృద్ధి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

సింగరేణికి వెన్నెముకలా విజిలెన్స్ విభాగం



మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థకు విజిలెన్స్ విభాగం వెన్నెముక వంటిదని సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. ఈ విభాగం నేతృత్వాన ఉద్యోగులు, సంస్థ ఆస్తుల పరిరక్షణ, మెడికల్ బోర్డ్ పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో విజిలెన్స్ విభాగం అధికారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడారు. సంస్థ ఆస్తుల పరిరక్షణతో పాటు అక్రమాలను అరికట్టాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. మెడికల్ బోర్డ్ సమయాన అన్‌ఫిట్ చేయిస్తామని ఎవరైనా డబ్బు వసూలు చేస్తే అడ్డుకోవాలని సూచించారు. సమావేశంలో జీఎం, ఉద్యోగులు పాల్గొన్నారు.

పలు అంశాలకు ఆమోదం

కొత్తగూడెంలోని సింగరేణి కార్యాలయంలో శుక్రవారం 103వ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎండీ బలరామ్, డైరెక్టర్ సత్యనారాయణరావుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు పాల్గొన్నారు. ఏటా డిసెంబర్‌లో నిర్వహించే ఈ సమావేశంలో వార్షిక లెక్కలు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు చర్చించిన పలు అంశాలను ఆమోదించినట్లు అధికారులు తెలిపారు.

శిశుగృహ అభివృద్ధిపై కలెక్టర్ దృష్టి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న శిశుగృహ అభివృద్ధిపై కలెక్టర్ జితేష్ వి.పాటిల్ దృష్టిసారించారు. అభివృద్ధి పనులకు, పిల్లల ఆట బొమ్మలు, ఇతర వస్తువుల కొనుగోలుకు రూ.14 లక్షలు మంజూరు చేశారు. శిశుగృహను 2021 ఆగస్టు 28న ప్రారంభించారు. విద్యుత్ పనుల మరమ్మతులు, ఫ్లోరింగ్, సీసీ కెమెరాలు, గోడలకు రంగులు, ప్లంబింగ్ పనులతోపాటు వర్షం కురుస్తున్న సమయంలో స్లాబ్ లీకేజీ కాకుండా పనులు చేపట్టేందుకు, శిశుగృహలో అంతర్గత రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించారు. పిల్లలు ఆడుకునేందుకు బొమ్మలు మరికొన్ని వస్తువుల కొనుగోలుకు మరో రూ.4 లక్షలు ఇలా కేటాయించారు. అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ అధికారి లెనినా తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా పరమాచార్య ఆరాధన



శ్రీమన్నారాయణచార్యులను సత్కరిస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: పట్టణంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో శ్రీశ్రీశ్రీ కంచి కామకోటి పీఠాధిశ్వరులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వాముల ఆరాధన ఉత్సవాల్లో భాగంగా పరమాచార్య ఆరాధన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఎల్.రమాదేవి సంస్కృత పండితులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులకి భద్రాద్రి విద్వత్ శేఖర బిరుదు ప్రదానం చేసి సత్కరించారు. ముందుగా మహాస్వామి పాదుకలను సంతానప్రద ఆంజనేయ స్వామి ఆలయం నుంచి బ్రాహ్మణ రాజ వీధుల మీదుగా ఊరేగింపుగా శుభం ఫంక్షన్ హాల్ వరకు తీసుకువెళ్లి అక్కడ పాదుకార్చనతో పాటు వైదిక కార్యక్రమాలను కామకోటి శిష్యకోటి వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వీరయ్య, ప్రధాన అర్చకులు కోటి రామస్వరూపాచార్య, ఆలయ వేద పండితులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో బిహార్ అధికారి



ధ్వజస్తంభం వద్ద విజయలక్ష్మి, తదితరులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానాన్ని బిహార్‌కు చెందిన ఐఏఎస్ అధికారి, ఆ రాష్ట్ర అడిషనల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ ఎన్.విజయలక్ష్మి శుక్రవారం సందర్శించారు. ఆమెకు అర్చకులు సంప్రదాయరీతిలో స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులు, శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారిని విజయలక్ష్మి దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లింగాల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి భక్త సమ్మేళనం

హాజరు కానున్న రామకృష్ణమఠం బాధ్యులు



విద్యుత్ లైట్ల వెలుతురులో స్వామి వివేకానంద విగ్రహం

సత్తుపల్లిటౌన్: శ్రీరామకృష్ణ పరమహంస -స్వామి వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన శని, ఆదివారం సత్తుపల్లిలో తెలుగు రాష్ట్రాల స్థాయి భక్త సమ్మేళనం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లను కాషాయ తోరణాలతో అలంకరించడమే కాక జేవీఆర్ పార్క్ వద్ద స్వామి వివేకానంద కాంస్య విగ్రహానికి లైట్లు ఏర్పాటుచేశారు. ఈ ప్రాంగణంలోనే నిర్మించిన స్వామి వివేకానంద హ్యూమన్ ఎక్స్‌లెన్స్ ఇన్‌స్టిట్యూట్ భవనంలో నిరుద్యోగ యువతకు వృత్తి విద్య నైపుణ్య కోర్సులు శిక్షణ ఇవ్వనున్నారు. కాగా, తొలిరోజైన శనివారం స్థానిక మాధురి ఫంక్షన్ హాల్‌లో విద్యార్థి సమ్మేళనం జరగనుంది. ఇందులో హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానందజీ మహరాజ్‌తో పాటు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, విజయవాడ రామకృష్ణమిషన్ నిర్వాహకులు స్వామి శితికంఠానంద మహరాజ్, ఎస్పీ కేజీవీ.సరిత ముఖ్యఅతిథులుగా పాల్గొంటారు. ఇక మధ్యాహ్నం జరిగే యువజన సమ్మేళనానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు, వందేమాతరం రవీందర్ హాజరవుతారు. అలాగే, ఆదివారం తెలుగు రాష్ట్రాల్లోని రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ నిర్వాహకులతో భక్త సమ్మేళనం నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

సింగరేణి(కొత్తగూడెం): రోడ్డు ప్రమాదంలో ఇల్లెందుకు చెందిన విద్యార్థి మృతి చెందిన ఘటన శుక్రవారం కొత్తగూడెం టూటౌన్ పరిధిలోని సీఆర్పీ క్యాంప్ వద్ద చోటుచేసుకుంది. ఇల్లెందుకు చెందిన జమీల్‌పాషా (15) పదో తరగతి చదువుతున్నారు. శుక్రవారం రామవరంలోని ఎస్సీబీనగర్‌లో నివాసముంటున్న తన పెద్దమ్మ ఇంటికి జమీల్‌పాషా వచ్చాడు. రామవరంలో షాపింగ్ చేసుకొని తన సోదరుడితో ఎస్సీబీనగర్‌కు బైక్‌పై వస్తున్న క్రమంలో సీఆర్పీ క్యాంప్ వద్ద బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే జమీల్‌పాషా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి అబ్దుల్ ఖాదర్ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా పోరు!





ఏకకాలంలో రెండు కోర్టుల్లో ఫ్లడ్ లైట్ల వెలుతురు మధ్య జరుగుతున్న మ్యాచ్‌లు (ఇన్‌సెట్) వరంగల్ - నల్లగొండ జట్ల మధ్య మ్యాచ్..

- ఖమ్మం పటేల్ స్టేడియంలో సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ
- పాత పది జిల్లాల నుంచి హాజరైన 240 మంది క్రీడాకారులు
- ఫ్లడ్ లైట్ల వెలుతురులో మ్యాచ్‌ల నిర్వహణ

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సీఎం కప్ బాలబాలికల వాలీబాల్ పోటీలు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేసినప్పటికీ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో సాదాసీదాగా మొదలుపెట్టారు. పోటీలను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీఈఓ సోమశేఖరశర్మ ప్రారంభించగా, తొలుత మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా క్రీడాకారులు మౌనం పాటించడంతో పాటు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని, రాత్రి వేళ కూడా పోటీలు నిర్వహించేలా కోర్టుల వద్ద ఫ్లడ్ లైట్లు ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుట్టా శంకరయ్య, స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్‌అలీ, పాఠశాలల క్రీడా సంఘం జిల్లా కార్యదర్శి కె.నర్సింహామూర్తి, క్రీడా సంఘాల ప్రతినిధులు ఎం.డీ.షఫీక్ అహ్మద్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఖమ్మం బాలుర జట్టు

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీకి పాత పది జిల్లాల వారీగా బాలబాలికల జట్లు హాజరయ్యాయి. మొత్తంగా 240మంది క్రీడాకారులతో పాటు కోచ్‌లు, మేనేజర్లు 60మంది హాజరయ్యారు. తొలిరోజైన శుక్రవారం బాలుర లీగ్ పోటీల్లో పూల్ 'ఏ' విభాగం నుంచి ఖమ్మం - మెదక్ జట్లు తలపడగా వరుసగా మూడు సెట్లలో 25-17, 25-20, 25-19 పాయింట్లు సాధించిన ఖమ్మం జట్టు విజయ దుందుభి మోగించింది. రెండో మ్యాచ్ వరంగల్-నల్లగొండ జట్ల మధ్య జరగగా 3-0 తేడాతో వరంగల్ నెగ్గింది. ఇక పూల్ 'బీ'లో మహబూబ్‌నగర్ - హైదరాబాద్ జట్ల నడుమ మ్యాచ్ జరగగా 3-0 స్కోర్‌తో మహబూబ్‌నగర్, రంగారెడ్డి - కరీంనగర్ మధ్య మ్యాచ్‌లో 3-0 తేడాతో రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. బాలికల విభాగానికొచ్చే సరికి నిజామాబాద్ - ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3-0 తేడాతో నిజామాబాద్ గెలవగా, నల్లగొండ-రంగారెడ్డి జట్లు తలపడిన మ్యాచ్‌లో నల్లగొండ జట్టు వరుసగా మూడు సెట్లు గెలిచి విజేతగా నిలిచింది. ఆతర్వాత వరంగల్- మెదక్ జట్ల మ్యాచ్ ఐదు సెట్లలో జరగగా 3-2 తేడాతో వరంగల్ విజయం సాధించింది. ఇక మహబూబ్‌నగర్-కరీంనగర్ జట్లు తలబడిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 3-0 తేడాతో గెలుపు దక్కించుకుంది.

పటేల్ స్టేడియంలో క్రీడోత్సాహం

పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు



కొద్దిరోజులుగా ప్రణాళికతో వ్యవహరిస్తూ టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పది జిల్లాల నుంచి బాలికల జట్లు కూడా వచ్చినందున వసతి విషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నాం. ఖమ్మం కీర్తిని ఇనుమడింపచేసేలా టోర్నీ నిర్వహణకు పలు కమిటీలను ఏర్పాటు చేశాం.

– టి.సునీల్ కుమార్‌రెడ్డి, డీవైఎస్‌ఓ, ఖమ్మం

బలంగా ఖమ్మం జట్లు



వాలీబాల్ టోర్నీలో పాల్గొంటున్న ఖమ్మం జట్లు బలంగా ఉన్నాయి. ఈసారి కప్ గెలుస్తామనే నమ్మకం ఉంది. గత విజయాలు, అనుభవాల ఆధారంగా ఈసారి ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించాం. సొంత జిల్లాలో జరుగుతున్న పోటీల్లో జయకేతనం ఎగురవేయడమే లక్ష్యం.

– ఎం.డీ.అక్బర్ అలీ, కోచ్, ఖమ్మం

మొత్తం 46 మ్యాచ్‌లు



రాష్ట్ర వాలీబాల్ టోర్నీలో బాలబాలికల విభాగాల్లో కలిపి 46 మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రతీ అంశంలో టెక్నికల్ కమిటీ బాధ్యతగా వ్యవహరిస్తూ పర్యవేక్షిస్తోంది. ఎక్కడా లోపాలు ఎదురుకాకుండా నిపుణులైన రెఫరీలు, లైన్ ఎంపైర్లు, స్కోరర్లను నియమించాం.

– గణపతి, వాలీబాల్ టెక్నికల్ రాష్ట్ర బోర్డు చైర్మన్

ఆటంకం లేకుండా ఫ్లడ్‌లైట్లు



ప్రతిరోజు ఫ్లడ్ లైట్ల వెలుతురులో మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పోటీలకు వచ్చిన క్రీడాకారులు ఇక్కడి ఏర్పాట్లను చూసి భేష్ అంటున్నారు. రెఫరీలకు సూచనలు చేస్తూ, మ్యాచ్ పూర్తి కాగానే కాస్త విరామంతో ఇంకో మ్యాచ్‌లు మొదలయ్యేలా పర్యవేక్షిస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, టోర్నీ టెక్నికల్ కన్వీనర్

గెలిచి సత్తా చాటేలా...



రాష్ట్రస్థాయి పోటీల్లో మా జిల్లా బాలికల జట్టు విజయం సాధించేలా తర్ఫీదు ఇచ్చాం. కప్ మాకు వచ్చినా, రాకున్నా ప్రత్యర్థి జట్లను పటిష్టంగా ఎదుర్కొనేలా ప్రణాళికలు రూపొందించాం. మా బాలికల జట్టు బలంగా ఉంది. క్రీడాకారులు కప్ సాధించాలనే తపనతో సిద్ధమయ్యారు.

– ఎం.వీరస్వామి, కోచ్, నల్లగొండ

పటిష్టమైన వ్యూహాలు



రాష్ట్రస్థాయి పోటీల్లో మన జిల్లా జట్టే గెలుస్తుంది. సీనియర్ వాలీబాల్ కోచ్‌ల వద్ద శిక్షణ తీసుకున్నాం. జట్టులో మంచి బూస్టర్, సెంటర్ క్రీడాకారిణులు ఉండడం కలిసొచ్చే అంశం. పక్కా ప్రణాళికతో అడుగులు వేసేలా వ్యూహాలు రూపొందించినందున తప్పక గెలుస్తాం.

– బి.అంబిక, ఖమ్మం

దళారుల దందాపై రైతుల ఆగ్రహం

కొనుగోలు కేంద్రంలో అధికారులను నిలదీసిన రైతాంగం



దళారుల కొనుగోళ్లపై అధికారులను నిలదీస్తున్న రైతులు



రైతుల ఆగ్రహంతో కొనుగోలు కేంద్రం వద్ద అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ప్రైవేట్ వ్యాపారులు, దళారులు తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కొనుగోలు కేంద్రం వద్దే కొంతమంది దళారులు కాంటాలు వేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో రైతులు అడ్డుకొని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ కృష్ణప్రసాద్ కేంద్రం వద్దకు ఏఓ శివరాం ప్రసాద్, ఆర్ఐ పద్మావతి, ఏఈఓ షాకిరా భానుతోపాటు మరికొంతమంది సిబ్బందిని పంపించారు. కేంద్రానికి చేరుకున్న అధికారులను రైతులు దళారుల వ్యవహారంపై నిలదీశారు. రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు తేమ శాతం సరిపడా లేదని సాకులు చెబుతున్నారని, దీంతో రైతులు రోజుల తరబడి కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నారని చెప్పారు. కానీ దళారుల వద్ద మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ధాన్యాన్ని కొనుగోలు చేయడంపై వారంతా మండిపడ్డారు. నెలల తరబడి కొనుగోలు చేయకపోవడంతో పేద రైతులు పడిగాపులు కాయలేక తక్కువ ధరకే ధాన్యాన్ని దళారులకు విక్రయించాల్సి వస్తోందని, ఈ పరిస్థితికి అధికారుల తీరే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారుల నిబంధనలతో కొందరు రైతులు దళారులను ఆశ్రయిస్తుండగా, ఆయా దళారులు నేరుగా కేంద్రం వద్దకే వచ్చి కాంటాలు వేసి కొనుగోలు చేస్తున్నారని, మద్దతు ధర కంటే తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేసి దోపిడీ చేస్తున్నట్లు బాధితులు వాపోయారు. అంతేకాదు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తిరిగి కేంద్రంలోనే ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించి, బినామీ పేర్లతో సొసైటీ రికార్డుల్లో నమోదు చేయించి క్వింటాకు రూ.500 బోనస్‌ను కాజేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజులుగా కేంద్రంలో సాగుతున్న ఈ దళారుల దందాను అడ్డుకోకపోవడంపై పలువురు రైతులు కేంద్రానికి వచ్చిన అధికారులను నిలదీశారు. దళారులు కొనుగోలు చేసి రెండు ట్రాక్టర్లు, ఒక లారీలో లోడింగ్ చేయించగా ఆయా వాహనాలను అడ్డుకున్నారు. అనంతరం అధికారులు కొనుగోలు కేంద్రంలో ప్రైవేట్ వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేయకుండా తగిన చర్యలు తీసుకుంటామని, కేంద్రం వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

బ్రిడ్జి కూలడంతో రాకపోకలు నిలిపివేత

చింతకాని: చింతకాని నుంచి కొణిజర్లకు వెళ్లే ప్రధాన రహదారిపై నేరడ సమీపాన ఉన్న కల్వర్టు బ్రిడ్జి శుక్రవారం కూలింది. దీంతో చింతకాని నుంచి నేరడ, కొణిజర్లకు వాహనాల రాకపోకలను నిలిచిపోయాయి. ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో కూలిందని గ్రామస్తులు తెలిపారు. ఈమేరకు బ్రిడ్జిని ఎస్సై నాగుల్‌మీరా పరిశీలించి రాకపోకలు జరగకుండా ట్రాక్టర్ ట్రక్కు అడ్డు పెట్టించారు. కాగా, అధికారులు ఇక్కడ కొత్త బ్రిడ్జిని నిర్మించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కారు డ్రైవర్‌పై పోక్సో కేసు

రఘునాథపాలెం: బాలికను అపహరించి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన కారు డ్రైవర్‌పై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17ఏళ్ల ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆమె తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు కారేపల్లి మండలంలోని భాగ్యనగర్ తండాకు చెందిన కారు డ్రైవర్ షేక్ ఇమామ్ ఆ బాలికను మాయమాటలతో నమ్మించి తీసుకెళ్లడమే కాక అత్యాచారానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈమేరకు ఆమెను బాలికను ఆస్పత్రికి తరలించి నిందితుడిపై పోక్సోకేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కాలువను తవ్వుతున్న ఇసుకాసురులు

కొందరికే అనధికారిక అనుమతులు



మల్లెపూల వాగులో ఇసుకను వడ కట్టి తరలిస్తున్న కూలీలు

దమ్మపేట: మండలంలోని రెడ్యాలపాడు శివారులోని మల్లెపూల వాగులో నిబంధనలకు విరుద్ధంగా, పరిమితులను దాటి యథేచ్ఛగా ఇసుకను తవ్వేస్తున్నారు. శుక్రవారం ఇసుక మాఫియా ఆధ్వర్యంలో ఈ మల్లెపూల వాగులో ఇసుకను కూలీల చేత వడ కట్టించి, ట్రాక్టర్లలోకి లోడింగ్ చేయిస్తున్నారు. ఈ అక్రమ మైనింగ్‌కు ఎలాంటి అధికారిక అనుమతులు లేకపోయినప్పటికీ, కొద్ది నెలలుగా ఇసుకను తోడేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల నుంచి ఎలాంటి చర్యలు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ అక్రమ మైనింగ్‌లో కొద్దిమంది స్థానికులు ముఠాగా ఏర్పడి, వారి ట్రాక్టర్లను తప్ప, ఇతరుల ట్రాక్టర్లను వాగులోకి అనుమతించకపోవడం గమనార్హం. ఇసుక మైనింగ్ తమకు మాత్రమే సొంతం అన్నట్టుగా ఈ ముఠా వ్యవహరించడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది. ఈ మైనింగ్ వ్యాపారంలో ఇసుకను, దూరాన్ని బట్టి ఒక ట్రాక్టరు ట్రక్కుకు రూ.3,500 నుంచి రూ.5,000 వరకు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు కలగజేసుకుని ఇసుక మైనింగ్‌కు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కళాకారులకు పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న గోవిందరావు



లక్ష్మీకాంతమ్మ



ఆదెర్ల శంకర్

ఖమ్మంగాంధీచౌక్/కారేపల్లి : ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురికి ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూవ్‌మెంట్ సంస్థ పురస్కారాలు ప్రకటించింది. ఈమేరకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఖమ్మంకు చెందిన జానపద కళాకారుడు కవి, రచయిత మోదుగు గోవిందరావు, కారేపల్లికి చెందిన ఆదెర్ల శంకర్‌కు గానకోకిల పురస్కారాలు, చింతకాని మండలం అనంతసాగర్‌కు చెందిన జానపద కళాకారిణి పత్తిపాటి లక్ష్మీకాంతమ్మకు ఉత్తమ కళాకారిణి అవార్డు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, సంస్థ బాధ్యులు మేకల చంద్రశేఖరయాదవ్, సుదర్శన్ మార్వాడి, రమేష్, కొమిరె వెంకన్న, సీతారాములు తదితరులు వీరికి అవార్డులు అందజేసి సన్మానించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ములకలపల్లి: మండలంలోని వేముకుంట శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి, వారి వద్ద నుంచి రూ.3 వేలు నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కిన్నెర రాజశేఖర్ తెలిపారు.

సోలార్ ప్లాంట్ వద్ద రోడ్డుప్రమాదం

రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి



మల్లయ్య (ఫైల్)



వెంకటేశ్వర్లు (ఫైల్)



ఘటనాస్థలిలో క్షతగాత్రులు



ఆస్పత్రిలో రోదిస్తున్న మల్లయ్య కుటుంబీకులు

ఇల్లెందు/కారేపల్లి : ఇల్లెందు – కారేపల్లి మండలాల సరిహద్దులో సోలార్ ప్లాంట్ వద్ద మూలమలుపులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఇంకో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇల్లెందు మండలం మాణిక్యారం పంచాయతీ పరిధి ఎల్లాపురానికి చెందిన లక్ష్మణ్, చింటు ఓ బైక్‌పై ఖమ్మం వైపు వెళ్తున్నారు. అదే సమయాన ఇల్లెందు వైపునకు మరో బైక్‌పై ఉసిరికాయలపల్లికి చెందిన ఎల్లావుల మల్లయ్య (40), మారుతి వెంకటేశ్వర్లు ఎదురుగా వచ్చారు. ఈ రెండు వాహనాలు సోలార్ ప్లాంట్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే, వెంకటేశ్వర్లు సైతం తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఇల్లెందు ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మృతుల్లో మల్లయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ రాజారాం ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇందిరమ్మ సర్వే కోసం వచ్చి..

హైదరాబాద్‌లో ఉంటున్న ఉసిరికాయలపల్లి వాసి మారుతి వెంకటేశ్వర్లు ఇందిరమ్మ సర్వే జరుగుతుండటంతో తన వివరాలు సమర్పించేందుకు గ్రామానికి వచ్చారు. సర్వే ముగిశాక మిత్రుడైన మల్లయ్యతో కలిసి ఇల్లెందు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో ఇద్దరు మృతి చెందటంతో కుటుంబాల్లో విషాదం నెలకొంది. కాగా, మల్లయ్య మృతదేహంతో పాటు అపస్మారక స్థితికి చేరిన వెంకటేశ్వర్లును ఇల్లెందు ఆస్పత్రికి తీసుకురాగా కుటుంబీకుల రోదనలతో మార్మోగింది. అనంతరం వెంకటేశ్వర్లును ఖమ్మం తరలించగా ఆయన సైతం మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరుగా రోదించారు. ఇక ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరికి చికిత్స చేస్తున్నారు.

సోలార్ ప్లాంట్ వద్ద తరచూ ప్రమాదాలు

ఇల్లెందు – కారేపల్లి మండలాల సరిహద్దులో ఏర్పాటు చేసిన సోలార్‌ప్లాంట్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు నెలల కిందట ఇక్కడే జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. సోలార్ ప్లాంట్ సమీపాన బైపాస్‌లో అనేక మలుపులు ఉన్నాయి. దీంతో కొత్తగా వచ్చే వారే కాక గ్రామస్తులు సైతం ప్రమాదాల బారిన పడుతున్నారు. సింగరేణి, ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

ప్రియుడి ఇంటి ముందు యువతి బైఠాయింపు

కొణిజర్ల: ప్రేమ పేరుతో తనతో సహజీవనం చేసి ఇప్పుడు ముఖం చాటేశాడని ఆరోపిస్తూ ఓ యువతి ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన ఘటన మండలంలోని సింగరాయపాలెంలో చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ యువతికి కొణిజర్ల మండలం సింగరాయపాలెంకు చెందిన సుధీర్‌తో హైదరాబాద్‌లో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దీంతో కొన్నాళ్లుగా వారు సహజీవనం చేస్తున్నారు. ఇంతలోనే సుధీర్ ఉద్యోగరీత్యా అమెరికా వెళ్లొచ్చాక సదరు యువతిని దూరం పెట్టినట్లు తెలిపింది. ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో ఆమె సింగరాయపాలెం చేరుకుని యువకుడి ఇంటి ఎదుట బైఠాయించింది. దీంతో యువకుడి కుటుంబీకులు తాళం వేసి వెళ్లిపోగా ఆమె అక్కడే కూర్చుని తనకు న్యాయం చేయాలంటూ స్థానిక పెద్దలను కోరుతోంది. ఈవిషయమై ఎస్ఐ సూరజ్‌ను వివరణ కోరగా ఇరుపక్షాల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండా గ్రామపంచాయతీ పరిధి జింకలగూడెంలో వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదైంది. సదరు వివాహిత పంట చేను నుంచి ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన మహ్మద్ సైదా వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆమె ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని పోలిశెట్టిగూడెంకు చెందిన కౌలు రైతు ఉండేటి రమేష్(45) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూలీ పనులకు వెళ్తూనే రమేష్ రెండేళ్లుగా గ్రామంలో రెండెకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆయన మిర్చి సాగు చేయగా పంట పెట్టుబడికి చేసిన అప్పులు పెరగడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం కానరాక మనోవేదనతో ఈనెల 26న ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న రమేష్ శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు భార్య పద్మ, ఇద్దరు పిల్లలు ఉండగా కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

అదుపుతప్పి బొగ్గు టిప్పర్ బోల్తా



బోల్తాపడిన టిప్పర్

టేకులపల్లి: అదుపుతప్పి బొగ్గు టిప్పర్ బోల్తా పడిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. శుక్రవారం తడికలపూడి యార్డు నుంచి 14 టైర్ల టిప్పర్ బొగ్గులోడ్ చేసుకుని టేకులపల్లి వైపునకు బయలుదేరింది. ఇదే సమయంలో ఖాళీ టిప్పర్ బొగ్గు కోసం యార్డుకు బయలుదేరింది. తడికలపూడి రోడ్డులో ఫారెస్టు కార్యాలయం సమీపంలో కల్వర్టు వద్ద ఎదురుగా వస్తున్న ఖాళీ టిప్పర్‌ని తప్పించబోయి బొగ్గులోడ్ టిప్పర్ కల్వర్టులోకి బోల్తా పడింది. దీంతో సుమారు 35టన్నుల బొగ్గు నేలపాలైంది. డ్రైవర్ మూడు రవి ప్రాణాలతో బయటపడ్డాడు.